


# అర్బన్ బ్యాంక్ పాలకవర్గాన్ని రద్దు చేయాలి!

- మార్చి 31తో గడువు ముగిసింది.. పదవిలో కొనసాగే అర్హత లేదు
- బైలా నిబంధనల ఉల్లంఘనపై మాజీ చైర్మన్ విలాస రెడ్డి ఫిర్యాదు

**కరీంనగర్, ఏప్రిల్ 04 (జనం పవర్):** కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంక్ ప్రస్తుత పాలకవర్గం బ్యాంక్ బైలా నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించిందని, తక్షణమే ఆ పాలకవర్గాన్ని రద్దు చేయాలని బ్యాంక్ మాజీ పర్సన్ ఇంచార్జీ చైర్మన్ గడ్డం విలాస రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన జిల్లా సహకార అధికారితో పాటు బ్యాంక్ సీఈఓకు ఫిర్యాదు చేసినట్లు శనివారం తెలిపారు. సహకార సంవత్సరంలో నిబంధనల ప్రకారం రెండు సభలు నిర్వహించాల్సి ఉండగా.. పాలకవర్గం ఆ బాధ్యతను విస్మరించిందని ఆరోపించారు.

## నిబంధనలు విరుద్ధంగా నిర్ణయాలు

మార్చి 29న జరగాల్సిన సమావేశాన్ని కోరం లేదనే నెపంతో వాయిదా వేసి, తిరిగి ఎప్పుడు నిర్వహిస్తారో స్పష్టత ఇవ్వలేదని విలాస రెడ్డి పేర్కొన్నారు. రిప్రజెంటేటివ్ ఎన్నికల తర్వాతే సర్వసభ్య సమావేశం ఉంటుందని చైర్మన్ కర్ర రాజశేఖర్ చెప్పడం సహకార చట్టాలకు వ్యతిరేకమని మండిపడ్డారు. సర్వసభ్య సమావేశంలో ఆమోదం పొందిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందని, కానీ ఇక్కడ అందుకు విరుద్ధంగా ప్రకటనలు చేయడం చట్టవిరుద్ధమని విమర్శించారు.

## పదవిలో కొనసాగే అర్హత లేదు

బైలా నిబంధన 21 ప్రకారం ప్రతి సహకార అర్ధ సంవత్సరంలో.. అంటే మార్చి 31లోపు మహాజన సభ నిర్వహించడం తప్పనిసరి అని విలాస రెడ్డి గుర్తుచేశారు. ఆ గడువులోగా సభ జరగకపోతే మరుసటి రోజైన ఏప్రిల్ 1 నుంచి పాలకవర్గం తన పదవిని కోల్పోయినట్లేనని స్పష్టం చేశారు. 18 వేల మంది సభ్యులున్న బ్యాంక్ సమావేశాన్ని కేవలం 200 మంది పట్టే కృషి భవన్‌లో ఏర్పాటు చేయడం పాలకుల చిత్తశుద్ధిని శంకిస్తోందని అన్నారు. చట్టబద్ధంగా పదవి కోల్పోయిన పాలకవర్గం ఇకపై ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా అవి చెల్లవని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# పిల్లల కేరింతలు.. రీల్స్‌లో చూస్తాం జగ్గన్నా!

## స్కూల్ బస్సెక్కి చిన్నారులతో ముచ్చటించిన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

## సాయం చేసే వీడియోలు చూస్తామంటూ మురిసిపోయిన పిల్లలు



**పటాన్ చెరువు, ఏప్రిల్ 04 (జనం పవర్):**
పటాన్ చెరువులో ఒక హృదయానికి హత్తుకునే సన్నివేశం చోటుచేసుకుంది. స్థానిక పెట్రోల్ బంకు వద్ద స్కూల్ బస్సులో ప్రయాణిస్తున్న చిన్నారులతో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆప్యాయంగా ముచ్చటించారు. ఆయనను చూడగానే "అగో జగ్గన్న" అంటూ పిల్లలు కేరింతలు కొట్టారు. ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా ఆనందంతో నిండిపోయింది.

## రీల్స్‌లో చూస్తాం జగ్గన్నా!

ఈ సందర్భంగా పిల్లలతో జగ్గారెడ్డి సరదాగా మాట్లాడారు. "నేను మీకు ఎలా తెలుసు?" అని ఆయన అడగగా.. "మేము మిమ్మల్ని రీల్స్‌లో చూస్తాం" అంటూ చిన్నారులు ఉత్సాహంగా సమాధానమిచ్చారు. "రీల్స్‌లో ఏం చూస్తారు?" అని మళ్లీ ప్రశ్నించగా.. "మీరు పేదలకు సాయం చేసే వీడియోలు, రామ్ మందిర్‌లో భజనలు, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల వీడియోలు చూస్తాం" అని చెప్పారు.

## పిల్లల్లో మిన్నంటిన ఉత్సాహం

వెలిమెల, పాటి, పోచారం, ఇస్నాపూర్, పటాన్ చెరువు ప్రాంతాలకు చెందిన ఈ చిన్నారులతో జగ్గారెడ్డి బస్సెక్కి ముచ్చటించడం వారికి మరింత సంతోషాన్ని ఇచ్చింది. ఈ చిన్న సంఘటన అక్కడున్న వారందరిలో చిరునవ్వులు పూయించింది. తనను గుర్తుపట్టిన పిల్లల ఆత్మీయతకు జగ్గారెడ్డి మురిసిపోయారు.




# ఘనంగా అచీవ్‌మెంట్ అవార్డ్స్!

- మార్కుల కోసం కాదు.. జీవితం కోసం చదవాలి: డైరెక్టర్ విజయ్ రెడ్డి
- సెయింట్ ఆంథోనీస్ స్కూల్ లో ప్రతిభావంతులకు బహుమతుల పంపిణీ

**సంగారెడ్డి, ఏప్రిల్ 04 (జనం పవర్):** సంగారెడ్డి జిల్లా శాంతినగర్ లోని సెయింట్ ఆంథోనీస్ హై స్కూల్ లో ఎనిమిది, తొమ్మిది తరగతుల విద్యార్థుల కోసం నాలుగవ రోజు అచీవ్‌మెంట్ అవార్డ్స్ ప్రధానోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ ఈ. విజయ్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఈ. అరుణా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్ లక్కి శెట్టి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అతిథుల దీప ప్రజ్వలన అనంతరం ఎనిమిదవ తరగతి విద్యార్థిని ఎం. లాస్య చేసిన స్వాగత నృత్యం అందరినీ ఆకట్టుకుంది. డైరెక్టర్ విజయ్ రెడ్డి మాట్లాడుతూ రెండు వేల ఇరవై ఐదు – ఇరవై ఆరు విద్యా సంవత్సరంలో విద్యార్థులు విద్యా, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో అద్భుత ప్రతిభ కనబర్చారని కొనియాడారు. కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా కమ్యూనికేషన్ స్కిల్స్, క్రిటికల్ థింకింగ్, క్రియేటివిటీ వంటి ఆధునిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. మార్కుల కోసం కాకుండా జీవితాన్ని నిర్మించుకోవడానికి విద్యను ఆయుధంగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసమే అసలైన విద్య అని ఆయన పేర్కొన్నారు. అకాడమిక్ ఎక్సలెన్స్, టాలెంట్ టెస్ట్, బెస్ట్ హ్యాండ్ రైటింగ్, అబాకస్ టాపర్స్ తో పాటు ఒలింపియాడ్ విజేతలకు ఈ సందర్భంగా అవార్డులు అందజేశారు. విద్యార్థుల ఉన్నతికి తోడ్పడుతున్న ఉపాధ్యాయులను, సిబ్బందిని డైరెక్టర్ అభినందించారు. తమ పిల్లల అభివృద్ధికి సహకరిస్తున్న తల్లిదండ్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరవై ఒకటవ శతాబ్దపు సవాళ్లను ఎదుర్కొనేలా విద్యార్థులు సిద్ధం కావాలని కోరారు.

# వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు..

- పేదలకు సకాలంలో మందులు, చికిత్స అందాలి
- గట్ల మల్యాల ఆసుపత్రిలో రికార్డుల పరిశీలన
- పీహెచ్‌సీలో హరీష్ రావు తనిఖీ!



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**
మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు నంగునూరు మండలం గట్ల మల్యాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రికి వస్తున్న రోగుల సంఖ్య, మందుల లభ్యతపై అక్కడి సిబ్బందిని ఆరా తీశారు. డాక్టర్లు సమయపాలన పాటిస్తూ పేదలకు నిరంతరాయంగా వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. అమరావతి, వాగు, అవుతలి గ్రామాల ప్రజల సౌకర్యార్థం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని.. రోగులకు సేవలందించడంలో ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని హరీష్ రావు స్పష్టం చేశారు. ఆసుపత్రిలో అన్ని రకాల మందులను ఎప్పుడూ అందుబాటులో ఉంచాలని సూచించారు. రక్త నమూనాలను ఎప్పటికప్పుడు టీ–డయాగ్నోస్టిక్ కేంద్రానికి పంపి, ఒక్క రోజులోనే రిపోర్టులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఆసుపత్రి నిర్వహణ సక్రమంగా ఉండాలని, రోగుల వివరాల రిజిస్టర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. రిజిస్టర్లను స్వయంగా పరిశీలించిన ఆయన.. కొన్ని సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. ప్రజారోగ్యం విషయంలో రాజీ పడకుండా పని చేయాలని వైద్యాధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పద్మశాలి ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం!

## మున్సిపల్, పంచాయతీ విజేతలకు ఆత్మీయ గౌరవం

## ఐక్యతతోనే సామాజికాభివృద్ధి: గాదె గుణసాగర్



**జమ్మికుంట, ఏప్రిల్ 04 (జనం పవర్):** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇటీవలి మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన పద్మశాలి ప్రజాప్రతినిధులకు ఆదివారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు. కరీంనగర్ లోని ఆర్టీసీ వర్క్‌షాప్ ఎదుట ఉన్న పద్మశాలి కళ్యాణ మండపంలో ఉదయం పది గంటలకు ఈ వేడుక జరగనుంది. మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో పాటు సర్పంచులు, ఉప సర్పంచులను ఈ సందర్భంగా ఘనంగా అభినందించనున్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని చేనేత ఐకాస ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదె గుణసాగర్ మాట్లాడారు. పద్మశాలి కుల బాంధవులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు ఆదర్శంగా నిలుస్తూ నిరంతరం అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. సమాజ ఐక్యతతోనే భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించగలమని గుణసాగర్ తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమం ప్రజాప్రతినిధుల్లో సేవాభావాన్ని మరింత పెంచుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కుల గౌరవాన్ని పెంచేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని ఆయన సూచించారు. సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే వారికి ఎప్పుడూ అండగా ఉంటామని వెల్లడించారు.

# జయహో యేసు.. సిద్దిపేటలో రన్ ఫర్ జీసస్!

## పునరుత్థాన సందేశంతో ఆధ్యాత్మిక శోభ.. లోక రక్షకుడి రాకడకై భక్తుల కేరింతలు





**సిద్దిపేట, ఏప్రిల్ 04 (జనం పవర్):** యేసుక్రీస్తు పునరుత్థానాన్ని పురస్కరించుకుని సిద్దిపేట పట్టణంలో సీఎస్ఐ చర్చి భక్తుల ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ సువార్త ర్యాలీ వైభవంగా జరిగింది. జయహో యేసు లేచియున్నాడు అనే నినాదాలతో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ర్యాలీ పట్టణంలోని విక్టరీ టాకీస్ చౌరస్తా నుంచి ప్రారంభమై ముస్తాబాద్ చౌరస్తా వరకు సాగి.. తిరిగి చర్చి వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా భక్తులు యేసుక్రీస్తు మహిమను గానాలు, ప్రార్థనల ద్వారా చాటిచెప్పారు. పునరుత్థానుడైన యేసు నందు ఆనందించాలని ప్రజలకు సందేశం అందించారు. క్రీస్తు చూపిన ప్రేమ, శాంతి, క్షమాభావం మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. క్రైస్తవ విశ్వాసానికి పునరుత్థానమే ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి సభ్యులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక నినాదాలతో పట్టణ పురవీధులు మారుమోగాయి. భక్తుల కోలాహలంతో సిద్దిపేటలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ వినూత్న ర్యాలీ స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది.

# వైద్య సేవలపై నిఘా.. వావిలాల పీహెచ్‌సీలో తనిఖీ!

## విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు: డాక్టర్ శ్రవణ్ కుమార్

## రికార్డులు, లేబర్ రూమ్ ల పరిశీలన.. సిబ్బందికి దిశానిర్దేశం



**జమ్మికుంట, ఏప్రిల్ 04 (జనం పవర్):** జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రవణ్ కుమార్ జమ్మికుంట మండలంలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, ఫార్మసీ రూమ్, లేబర్ రూమ్ తో పాటు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్ అసెస్మెంట్ టూల్ ను ఈ సందర్భంగా ధ్రువీకరించారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

## వ్యాధుల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి

నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్ (ఎన్ సి డి) క్లినిక్ లను పగడ్బందీగా నిర్వహించాలని డాక్టర్ శ్రవణ్ కుమార్ సూచించారు. హైపర్ టెన్షన్, డయాబెటిస్, బ్రెస్ట్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్ వంటి పరీక్షలు క్రమం తప్పకుండా చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఆశా కార్యకర్తలు కుష్టు వ్యాధి సర్వే నిర్వహించి బాధితులను ప్రాథమిక దశలోనే గుర్తించాలని తెలిపారు. క్షయ వ్యాధి నిర్ధారణ కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి తెమడ నమూనాలు సేకరించాలని ఆదేశించారు.

## అవగాహనతోనే ఆరోగ్యం

హెచ్ పి వి వ్యాక్సినేషన్ పై బాలికలకు అవగాహన కల్పించాలని.. అర్హులైన ప్రతి ఒక్కరూ టీకా తీసుకునేలా చూడాలని పేర్కొన్నారు. పెరుగుతున్న ఎండల దృష్ట్యా వడదెబ్బ పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. అభా కార్డుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలని.. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం, హెల్త్ ఎడ్యుకేటర్ అడిదెల మోహన్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు డీక్యూఎంఏ అఖిల్, సూపర్వైజర్ సదానందం, ఫార్మసిస్ట్ రాజ శ్రీధర్ రావు, నర్సింగ్ ఆఫీసర్ సాయికుమార్ తదితరులు ఈ తనిఖీలో పాల్గొన్నారు. పీహెచ్‌సీ పరిధిలో వైద్య సేవలు మెరుగుపరచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి పిలుపునిచ్చారు.

# అల్లీపూర్‌కు మహర్దశ.. రోడ్డు పనులకు శ్రీకారం!

**పది లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు షురూ**

**కాంగ్రెస్ తోనే పల్లెల అభివృద్ధి: ఏఎంసీ చైర్మన్ మహేందర్**



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

చిన్నకోడూరు మండలం అల్లీపూర్ గ్రామంలో పది లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ శంకుస్థాపన చేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లా ఇన్ చార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి, నియోజకవర్గ ఇన్ చార్జ్ పూజల హరికృష్ణ సహకారంతో ఈ నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. గ్రామ సర్పంచ్ కుంబాల మనేమ్మ, ఉప సర్పంచ్ కొలన్‌పాక శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కొబ్బరికాయ కొట్టి పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఆరు నెలల క్రితం కూడా మంత్రి చొరవతో ఐకేపీ సెంటర్ వరకు సీసీ రోడ్డు పనులు పూర్తి చేశామని మహేందర్ గుర్తు చేశారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పట్ల అల్లీపూర్ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ నముండ్ల వినోద్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సందబోయిన పర్శరాం పాల్గొన్నారు. వార్డు సభ్యుడు సునీల్, గ్రామస్తులు రాజిరెడ్డి, వానాకర్ రెడ్డి, భూమయ్య, ముత్యం హాజరయ్యారు. కోడెల నాగరాజు, కోర్రి శంకర్, ఎర్ర బాలయ్య, శేఖర్, దుర్గారెడ్డి సహా పలువురు గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పల్లెల సుందరీకరణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఈ సందర్భంగా నేతలు కొనియాడారు.

# యేసు ప్రేమను చాటుదాం.. రన్ ఫర్ జీసస్!

**సంగారెడ్డిలో నిర్మలా జగ్గారెడ్డి సందడి**

**క్రీస్తు పునరుత్థాన వేడుకల్లో భారీ ర్యాలీ**




**సంగారెడ్డి, ఏప్రిల్ 05 (జనం పవర్):** సంగారెడ్డి పట్టణంలో ఈస్టర్ సందర్భంగా యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం ఆధ్వర్యంలో 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ భారీ ర్యాలీ పోతిరెడ్డిపల్లి చౌరస్తా మీదుగా సీఎస్ఐ చర్చి వరకు ఉత్సాహంగా సాగింది. భక్తుల కోలాహలంతో పట్టణమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కీర్తనలు పాడుతూ.. భక్తి నృత్యాలు చేస్తూ భక్తులు యేసుక్రీస్తును స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. యేసు పునరుత్థానాన్ని స్మరించుకుంటూ ఆయన ప్రేమను సమాజానికి తెలియజేయడానికి ఈ రన్ ఫర్ జీసస్ చక్కని వేదిక అని కొనియాడారు. క్రీస్తు బోధించిన శాంతి.. కరుణ ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్.. పట్టణ అధ్యక్షుడు జార్జ్.. నాయకుడు కూన సంతోష్ పాల్గొన్నారు. వీరితో పాటు యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం నేతలు రూబీన్ రెడ్డి.. ప్రవీణ్.. సునీల్ నిర్మల్ కుమార్.. మధు మోహన్.. సునీల్ జై కుమార్ హాజరయ్యారు. పాస్టర్లు రెవరెండ్ జార్జ్ ఎబినైసర్.. మధు కుమార్.. జాన్ పీటర్.. సత్యానంద్.. సత్య పాల్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పట్టణ వీధులన్నీ క్రైస్తవ సోదరుల ఆధ్యాత్మిక నినాదాలతో మారుమోగాయి.

# వాగులో ఇసుక చోరీ.. ఇద్దరిపై కేసు!

**అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు: ఎస్సై వివేక్**



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

అక్కెనపల్లి గ్రామ శివారులోని వాగు ప్రాంతం నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు శనివారం పట్టుకున్నారు. తిప్పని కిష్టయ్య, జంగోని రమేష్ అనే వ్యక్తులు రెండు ట్రాక్టర్లలో దొంగతనంగా ఇసుకను తరలిస్తుండగా సమాచారం అందుకున్న రాజగోపాల్ పేట ఎస్సై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివేక్ తెలిపారు. మండలంలో ఎవరైనా పర్మిషన్ లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ సంపదను కొల్లగొడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఇసుక మాఫియాపై నిఘా కొనసాగుతుందని, అక్రమాలకు పాల్పడితే వాహనాలను సీజ్ చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. పర్యావరణానికి విఘాతం కలిగించే పనులకు పాల్పడవద్దని గ్రామస్థులకు సూచించారు.




# ఆదర్శ వివాహం.. అభ్యుదయ ప్రయాణం!

- **విజేత, ప్రీతమ్ లను దీవించిన శ్రీనివాస్ రెడ్డి, చాడ వెంకటరెడ్డి**
- **సామాజిక సేవలో భాగస్వాములు కావాలని ప్రముఖుల ఆకాంక్ష**




**కరీంనగర్, ఏప్రిల్ 04 (జనం పవర్):** జీవితంలో ఒకరినొకరు అర్థం చేసుకుని ఆదర్శ వివాహం చేసుకోవడం అభినందనీయమని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం కరీంనగర్ లోని ఇందిరా గార్డెన్ లో ఏఐఎస్ఎఫ్ నేతలు కండె విజేత, రేణుకుంట్ల ప్రీతమ్ ల ఆదర్శ వివాహం వైభవంగా జరిగింది. దీనికి వీరు ముఖ్య అతిథులుగా హాజరై, సామాజిక శ్రేయస్సు కోసం పాటుపడాలని నూతన దంపతులకు సూచించారు.

**ప్రమాణ స్వీకారంతో ఒక్కటైన జంట**

ఈ వివాహ వేడుకలో విజేతతో శ్రీనివాస్ రెడ్డి, ప్రీతమ్ తో చాడ వెంకటరెడ్డి ప్రమాణ పత్రాలను చదివించారు. అనంతరం దంపతులు వివాహ పత్రాలపై సంతకాలు చేసి దండలు మార్చుకుని ఒక్కటయ్యారు. మానవ సమాజంలో స్త్రీ పురుషులు ఒకరికొకరు అండగా ఉండటం సనాతన సంప్రదాయమని వక్తలు పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే అభ్యుదయ భావాలతో పెరగడం శుభపరిణామమని, సురవరం సుధాకర్ రెడ్డి వంటి నేతల బాటలో నడవాలని ఆకాంక్షించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, తాండ్ర సదానందం, మంద సుదర్శన్ పాల్గొన్నారు. అలాగే ఏఐఎస్ఎఫ్ నేతలు మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్, కార్పొరేటర్ మార్కాపురి సూర్య హాజరై నూతన జంటను ఆశీర్వదించారు. సామాజిక సమస్యలపై స్పందిస్తూనే వైవాహిక జీవితంలో అందరికీ ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ ఆదర్శ వివాహానికి బంధుమిత్రులతో పాటు అభ్యుదయవాదులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

# సిద్దిపేటలో రాజస్థానీ కుండల సందడి!

**వేసవి తాపానికి మట్టి కుండలే శరణ్యం**

**రంగురంగుల డిజైన్లతో ఆకట్టుకుంటున్న విక్రయాలు**



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

వేసవికాలం ప్రారంభం కావడంతో సిద్దిపేట పట్టణంలో మట్టి కుండల విక్రయాలు మళ్లీ ఊపందుకున్నాయి. హైదరాబాద్ రోడ్డుపై మైత్రివనం సమీపంలో రాజస్థాన్ నుండి వచ్చిన వ్యాపారులు రంగురంగుల పెయింటింగ్‌లతో అలంకరించిన మట్టి కుండలను రోడ్డుపై ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. పూర్వీకుల కాలంలో ఫ్రిడ్జ్‌లు లేకపోవడంతో ప్రతి ఇంట్లో మట్టి కుండలు తప్పనిసరిగా ఉండేవి. మట్టి కుండలో నిల్వ చేసిన నీరు సహజంగా చల్లగా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి కూడా శ్రేయస్కరమని పెద్దలు చెప్పేవారు. కాలక్రమేణా ఫ్రిడ్జ్ వినియోగం పెరగడంతో ఈ సంప్రదాయం తగ్గింది.

**ఆకట్టుకుంటున్న కళాకృతులు**

ప్రస్తుతం వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మట్టి కుండల వినియోగం మళ్లీ పెరుగుతోంది. ముఖ్యంగా రాజస్థాన్ నుండి తీసుకొచ్చిన కుండలకు ఆకర్షణీయమైన పెయింటింగ్‌లు వేయడంతో అవి ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. రోడ్డుపై వెళ్లే వారు ఒక్కసారి ఆగి వీటిని ఆసక్తిగా చూసి కొనుగోలు చేస్తున్నారు. ఇవి ఇంటికి కొత్త అందాన్ని ఇస్తుండటంతో గృహిణులు కూడా వీటి వైపు మొగ్గు చూపుతున్నారు.

**అందుబాటులో ధరలు**

విక్రేతలు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ కుండల ధరలు పరిమాణం, డిజైన్‌ను బట్టి 400 నుండి 600 రూపాయల వరకు ఉన్నాయి. మంచి లుక్‌తో పాటు సహజంగా చల్లటి నీరు లభించడం వల్ల ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. వేసవిలో మట్టి కుండలకు మళ్లీ ఆదరణ పెరుగుతుండగా, రాజస్థాన్ కుండల ఆకర్షణ సిద్దిపేటలో కొత్త ట్రెండ్‌గా మారింది. ఆరోగ్యంతో పాటు చల్లదనాన్ని ఇచ్చే ఈ కుండలు సామాన్యులకు సైతం అందుబాటులో ఉన్నాయి.





# పదేళ్లు మనదే రాజ్యం.. సిద్దిపేటలో కాంగ్రెస్ జోరు!

- **బిఆర్ఎస్ ఖాళీ.. కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు**
- **కెసిఆర్ ను ఫామ్ హౌస్‌కే పరిమితం చేసిన జనం: పూజల హరికృష్ణ**



**సిద్దిపేట, ఏప్రిల్ 04 (జనం పవర్):** సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో 11వ వార్డుకు చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి సిద్దిపేట నియోజకవర్గ ఇన్ చార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మరో పదేళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయమని హరికృష్ణ స్పష్టం చేశారు. గత పదేళ్ల పాలనలో కెసిఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆరోపించారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను నాశనం చేశారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతోనే ప్రజలు కెసిఆర్ ను ఫామ్ హౌస్ కే పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ప్రభుత్వ అప్పులకు వడ్డీలు చెల్లిస్తూనే రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని హరికృష్ణ పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో బొమ్మల యాదగిరి, ముద్దం లక్ష్మి, రషద్, వహాబ్, గయాస్, హర్ష, విజయ్, డానియల్ పాల్గొన్నారు. బిఆర్ఎస్ నుంచి భారీగా చేరికలు జరగడం సిద్దిపేటలో రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

# భూములు లాక్కోవడమేనా?

- టీజీఐఐసీ పేరిట రైతుల పొట్ట కొట్టొద్దు
- కలెక్టర్‌తో చింత ప్రభాకర్ భేటీ!
- ఇసుక మాఫియాను కట్టడి చేయాలని డిమాండ్
- నిలిచిన అభివృద్ధి పనులపై కలెక్టర్ ఆరా



**సంగారెడ్డి, ఏప్రిల్ 04 (జనం పవర్):** సంగారెడ్డి నియోజకవర్గంలో నెలకొన్న పలు పెండింగ్ సమస్యలపై ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కలిసి కీలక అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా రైతుల సమస్యలు, భూముల కేటాయింపులు, అభివృద్ధి పనులపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. టీజీఐఐసీకి భూముల కేటాయింపు ప్రక్రియ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివరించారు.

### రైతులకు తీరని అన్యాయం

భూములు కోల్పోవడం వల్ల రైతుల జీవనోపాధి దెబ్బతింటోందని, వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చింత ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చిందని.. ప్రస్తుతం అదే భూములను టీజీఐఐసీ పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల నుంచి తీసుకోవడం దారుణమని ఆరోపించారు. కొంతమంది వ్యక్తులకు అనుకూలంగా భూముల కేటాయింపులు జరగడం వల్ల భవిష్యత్తులో గ్రామాల అభివృద్ధికి భూములు ఉండవని ఆందోళన వ్యక్తం చేశారు.

### మాఫియాపై ఉక్కుపాదం మోపాలి

నియోజకవర్గంలో ఇసుక మాఫియా విచ్చలవిడిగా కొనసాగుతోందని, దీనిని నియంత్రించడంలో అధికారులు విఫలమయ్యారని ఎమ్మెల్యే విమర్శించారు. వెంటనే దీనిని కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డు వెడల్పు పనులు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకల్లో ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. చిమ్నాపూర్ గ్రామ భూ సమస్యలు పరిష్కరించాలని, సైదాపూర్ పంచాయతీ భవనానికి నిధులు ఇవ్వాలని కోరారు.

### విచారణకు కలెక్టర్ ఆదేశం

కంది మండలం బేగంపేటలో ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. వీటిపై స్పందించిన కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. అక్రమాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# వైద్య సేవలపై 'అనిత' నజర్.. ఆకస్మిక తనిఖీలు!

- ప్రాణాంతక వ్యాధులపై యుద్ధం.. ముందస్తు పరీక్షలకు ఆదేశం
- వేసవి హెచ్చరిక.. అంగన్‌వాడీల్లో ఓఆర్ఎస్ సిద్ధం



**దండేపల్లి, ఏప్రిల్ 04 (జనం పవర్):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ అనిత దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.. లింగాపూర్.. తాళ్లపెట్ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. అసంక్రమణ వ్యాధులపై నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో పదిహేను రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం ద్వారా హెచ్ఐవి.. ఎయిడ్స్.. క్షయ వ్యాధుల గుర్తింపునకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

### వ్యాధులపై ముందస్తు పోరు

జీవనశైలి మార్పులతో డయాబెటిస్.. బిపి.. క్యాన్సర్ వంటి వ్యాధులు పెరుగుతున్నాయని.. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అనిత సూచించారు. క్యాన్సర్ నిరోధానికి పద్నాలుగు ఏళ్లు నిండిన బాలికలకు హెచ్ పీ వీ వ్యాక్సినేషన్ ఇప్పించాలని కోరారు. క్షయ వ్యాధిని గుర్తించేందుకు తెమడ పరీక్షలు.. మొబైల్ ఎక్స్రే సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. వ్యాధిగ్రస్తులకు మందులతో పాటు పోషకాహారం.. పారితోషకం అందించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

### వేసవి జాగ్రత్తలు తప్పనిసరి

ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనిత హెచ్చరించారు. అన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ.. ఆశా కార్యకర్తల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. జిల్లాలోని నలభై ఐదు ఉప కేంద్రాలను జాతీయ క్వాలిటీ సర్టిఫికెట్ కోసం సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దీనికోసం క్వాలిటీ మేనేజర్లు రాజ్ కుమార్.. మౌనిక.. మార్తా.. డీపీఓ ప్రశాంతి సమన్వయం చేసుకోవాలని సూచించారు. మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు.. వైద్య సిబ్బంది.. జాతీయ ఆరోగ్య మిషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.





# వైభవంగా రథోత్సవం.. పులకించిన బెజ్జంకి!

- కన్నుల పండుగగా లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు
- హాజరైన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- భక్తి పారవశ్యంలో మహిళల గిరి ప్రదక్షిణ



**బెజ్జంకి, ఏప్రిల్ 04 (జనం పవర్):** బెజ్జంకి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజామున మూడు గంటలకు ప్రారంభమైన రథ యాత్ర ఉదయం ఏడు గంటలకు స్వామివారి ప్రధాన ద్వారం వద్దకు చేరుకుంది. భక్తుల గోవింద నామస్మరణతో జాతర ప్రాంగణం మారుమోగింది. పరిసర గ్రామాల నుంచి జనం భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. రథోత్సవ వేడుకలకు మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఆలయ అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. వేద మంత్రాల మధ్య స్వామివారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్, ఈవో శ్రీధర్ రెడ్డి, ప్రధాన అర్చకులు మధుసూదనాచారి ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి స్వామివారి ప్రతిమను బహూకరించారు.

### మొదటిసారి గిరి ప్రదక్షిణ

ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో సరికొత్త అధ్యాయం మొదలైంది. అరుణాచలం, యాదగిరిగుట్ట తరహాలో బెజ్జంకిలోనూ మహిళలు పెద్ద సంఖ్యలో గిరి ప్రదక్షిణ చేశారు. భక్తి గీతాలు పాడుతూ కొండ చుట్టూ కాలినడకన ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. బ్రహ్మోత్సవాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపకపోవడంపై భక్తుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. సొంత జిల్లాలో రవాణా శాఖ మంత్రి ఉన్నప్పటికీ.. భక్తుల సౌకర్యార్థం బస్సులు ఏర్పాటు చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఆలయ కమిటీ కూడా ఈ విషయంలో చొరవ తీసుకోకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు ఇబ్బందులు పడ్డారు. రథోత్సవం సందర్భంగా ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, బెజ్జంకి ఎస్ఐ సౌజన్య ఆధ్వర్యంలో పటిష్ట భద్రత కల్పించారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై నిఘా ఉంచారు. పోలీసుల పర్యవేక్షణలో రథోత్సవం ప్రశాంతంగా ముగిసింది.

# రైతన్నకు వరం.. రైస్ మిల్లు ప్రారంభం!

**పల్లెల్లో పరిశ్రమలతోనే యువతకు ఉపాధి**

**రైతులకు తప్పనున్న రవాణా భారం: మంత్రి వివేక్**




**జైపూర్, ఏప్రిల్ 04 (జనం పవర్):** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారంలో లక్ష్మీ గణపతి నూతన రైస్ మిల్లును రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి శనివారం ప్రారంభించారు. మిల్లు యజమానులకు అభినందనలు తెలుపుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి పెరుగుతుందని పేర్కొన్నారు. ధాన్యానికి దగ్గరలోనే ప్రాసెసింగ్ సౌకర్యాలు ఉండటం వల్ల రైతులకు రవాణా ఖర్చులు తగ్గి లాభం కలుగుతుందని మంత్రి వివరించారు. ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహకాలు అందిస్తోందని.. యువ పారిశ్రామికవేత్తలు ధైర్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మంత్రి చొరవ.. కాన్కూరులో తీరిన రోడ్డు కష్టాలు!

**ఎనిమిదో వార్డులో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి**

**ప్రభుత్వ పనితీరుపై గ్రామస్తుల హర్షం**



**జైపూర్, ఏప్రిల్ 04 (జనం పవర్):** జైపూర్ మండలం కాన్కూరు గ్రామ ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. గ్రామంలోని ఎనిమిదో వార్డులో రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజల కోసం మంత్రి చొరవతో సీసీ రోడ్డును నిర్మించారు. గ్రామ సర్పంచ్ కొయ్యడ మౌనిక వెంకటేశ్వర్ గౌడ్ ప్రత్యేక శ్రద్ధతో ఈ పనులు వేగంగా పూర్తయ్యాయి. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తూ కార్మిక, గనుల శాఖ మంత్రి అభివృద్ధిలో దూసుకుపోతున్నారని గ్రామస్థులు కొనియాడారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సర్వత్రా సంతోషం వ్యక్తమవుతోంది. ఇలాంటి పనులతో ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందని సర్పంచ్ తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

# సొంతింటి కల సాకారం.. ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం!


**ప్రజా పాలన వేగానికి ఇదే నిదర్శనం: మేయర్ దర్ని మధుకర్**

**ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సహకారంతో అభివృద్ధి**



**వేల్పుల నగేష్ ,జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

మంచిర్యాల నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం వేగంగా అమలవుతోంది. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇరవై నాలుగో వార్డులో లబ్ధిదారుడు అట్కాపురం తిరుమల రాజేశం నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం శనివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా మున్సిపల్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య హాజరై నూతన గృహాలను ప్రారంభించారు. ప్రజా పాలన ప్రభుత్వంలో పథకాలు ఎంత వేగంగా ప్రజలకు అందుతాయో చెప్పడానికి పూర్తవుతున్న ఈ ఇళ్లే నిదర్శనమని మేయర్ మధుకర్ అన్నారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అండదండలతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. లబ్ధిదారులకు ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. గృహప్రవేశానికి విచ్చేసిన మేయర్, డిప్యూటీ మేయర్‌లను లబ్ధిదారులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొడ్డు స్వప్న తిరుపతి, గృహ నిర్మాణ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సొంత గూడు ఏర్పడటంతో లబ్ధిదారుల కుటుంబంలో ఆనందం వ్యక్తమైంది.



# క్యాతనపల్లి మున్సిపల్ పీఠం ఖరారు!

**చైర్‌పర్సన్‌గా సంధ్యారాణి.. వైస్ చైర్‌పర్సన్‌గా సరిత**

**పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ.. వీడియో రికార్డింగ్‌తో నిఘా**




**క్యాతనపల్లి, ఏప్రిల్ 04 (జనం పవర్):** మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఎన్నికల ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ పీ. చంద్రయ్య పర్యవేక్షించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి సబ్ కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు మనోజ్ తో పాటు మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ హాజరయ్యారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టారు. దీనికోసం ప్రత్యేకంగా ప్రత్యక్ష ప్రసారం (లైవ్) ఏర్పాట్లు చేశారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా గొడిసెల సంధ్యారాణి, వైస్ చైర్‌పర్సన్‌గా మిట్టపెల్లి సరిత ఎన్నికయ్యారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. నూతన పాలకవర్గానికి పలువురు అభినందనలు తెలియజేశారు.

# ఫోన్ కొట్టగానే నీళ్లొచ్చాయి.. వైస్ చైర్మన్ స్పీడ్!

**బజార్ వాడలో యుద్ధప్రతిపాదికన మోటార్ మరమ్మతులు**

**ఫిర్యాదు చేసిన గంటల్లోనే పరిష్కారం.. కాలనీవాసుల హర్షం**



**వేల్పుల నగేష్ - జనం పవర్ - ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

ఆసిఫాబాద్ పట్టణంలోని బజార్ వాడ ప్రాంతంలో నీటి కష్టాలు తీరాయి. అక్కడ వాటర్ మోటార్ చెడిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం స్థానికులు మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఆయన తక్షణమే స్పందించి మున్సిపల్ సిబ్బందిని ఘటనా స్థలానికి పంపారు. యుద్ధప్రతిపాదికన మోటార్ కు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. సమస్యను ఫిర్యాదు చేసిన వెంటనే పరిష్కరించినందుకు కాలనీ ప్రజలు వైస్ చైర్మన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగో వార్డు కౌన్సిలర్ బాలకృష్ణ, బిఆర్ఎస్ నాయకులు ప్రేమ్, స్థానికులు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పట్ల ప్రజాప్రతినిధులు ఇలాగే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఎమ్మెల్యే చొరవ.. దోడర్నలో నీటి కష్టాలు మాయం!

**చెప్పిన వెంటనే బోరు వేయించిన రామారావు పటేల్**

**పల్లె ప్రజలకు తీరిన తాగునీటి వెతలు**



**వేల్పుల నగేష్ -జనం పవర్-ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

నిర్మల్ జిల్లా కుబీర్ మండలం దోడర్న గ్రామంలో తాగునీటి సమస్యకు తెరపడింది. తమ గ్రామంలో నీటి కష్టాలు ఉన్నాయని గ్రామస్తులు ఇటీవల ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విన్నపానికి ఆయన వెంటనే స్పందించి గ్రామంలో కొత్తగా బోరు వేయించారు. దానిని స్వయంగా ప్రారంభించి ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. తమ సమస్యను త్వరగా పరిష్కరించినందుకు గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామంలో జరిగిన ఒక వివాహ వేడుకకు ఎమ్మెల్యే హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాకతో గ్రామంలో సందడి నెలకొంది. సమస్యను విన్న వెంటనే పరిష్కరించిన తీరుపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



# ఖానాపూర్ పీఠంపై 'వాయిదా' కుట్ర.. కలెక్టర్ కు ఫిర్యాదు!

- అధికార బలంతో ఎన్నికల వాయిదా.. విపక్షాల ఆగ్రహం
- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని బిఆర్ఎస్, బిజెపి నేతల మండిపాటు



**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

ఖానాపూర్ మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల చుట్టూ రాజకీయ సెగలు రాజుకున్నాయి. స్పష్టమైన బలం ఉన్నప్పటికీ.. అధికార బలంతో ఎన్నికలను వాయిదా వేయించడంపై విపక్షాలు కౌంటర్ అటాక్ మొదలుపెట్టాయి. ఈ మేరకు బిఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్, బిజెపి జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ ఆధ్వర్యంలో నాయకులు నిర్మల్ జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

### అధికార యంత్రాంగంపై గర్జన

ఎన్నికల వాయిదా వెనుక భారీ కుట్ర దాగి ఉందని, ఇది ముమ్మాటికీ ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని నేతలు విమర్శించారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే అధికారులు పనిచేస్తున్నారని.. ఎన్నికలను ప్రకటించకుండా కావాలనే తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. సంఖ్యాబలం తమ వైపు ఉన్నా.. కుతంత్రాలతో ఎన్నికలను అడ్డుకోవడం ఓటమిని అంగీకరించడమేనని ఎద్దేవా చేశారు. నిబంధనలను తుంగలో తొక్కి అధికార పక్షానికి సహకరిస్తున్న అధికారులపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

### పారదర్శకంగా ఎన్నికలు జరపాలి

జరగబోయే ఎన్నికల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ఉండాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఎలాంటి బెదిరింపులు, ఒత్తిళ్లకు తావులేకుండా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని పకడ్బందీగా వీడియో రికార్డింగ్ చేయాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ ప్రలోభాలకు, అధికారుల అతి ఉత్సాహానికి అడ్డుకట్ట వేయకపోతే ప్రజా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇరు పార్టీల కౌన్సిలర్లు, కీలక నేతలు పాల్గొన్నారు.

# వేసవి దప్పిక తీరుద్దాం..

- జగ్గారెడ్డి, నిర్మల సమీక్ష!
- తాగునీటి ఎద్దడి రాకుండా పక్కా ప్రణాళిక
- మూడు కోట్ల డెబ్బై లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం



**సంగారెడ్డి, ఏప్రిల్ 04 (జనం పవర్):** వేసవి కాలంలో సంగారెడ్డి నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకూడదని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం రామ్‌నగర్ లోని తమ నివాసంలో మిషన్ భగీరథ, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి నీటి సరఫరాపై సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

### కోట్లాది రూపాయలతో ప్రతిపాదనలు

నియోజకవర్గంలో తక్షణ అవసరాల కోసం డెబ్బై ఒక్క లక్షల రూపాయలు అవసరమని అధికారులు తెలిపారు. అలాగే శాశ్వత పరిష్కారం కోసం మూడు కోట్ల డెబ్బై లక్షల రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఈ నిధుల కోసం కలెక్టర్ తో పాటు ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని జగ్గారెడ్డి పేర్కొన్నారు. కంది, సంగారెడ్డి మండలాల్లో పైప్ లైన్ మరమ్మతుల కోసం పద్దెనిమిది లక్షలు, కొండాపూర్ లో పది లక్షలు, సదాశివపేటలో పదిహేను లక్షలు అత్యవసరంగా అవసరమని గుర్తించారు.

### మున్సిపాలిటీల్లో నీటి గోసకు చెక్

సదాశివపేటలో రోజు విడిచి రోజు నీటి సరఫరా జరుగుతుండటంపై జగ్గారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఎండిపోయిన ముప్పై బోర్ల స్థానంలో కొత్తవి తవ్వించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో కూడా వెంటనే బోర్ వేయించి మోటార్ అమర్చాలని సూచించారు. సంగారెడ్డి పట్టణంలో మిషన్ భగీరథ నుంచి వస్తున్న నీటి కొరతను అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి పరిమాణాన్ని కొలిచేందుకు వీలుగా ఫ్లో మీటర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### సమన్వయంతోనే పరిష్కారం

తాగునీటి సరఫరా విషయంలో అధికారులు ఎలాంటి అనుమతుల కోసం ఎదురుచూడకుండా త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని జగ్గారెడ్డి సూచించారు. మిషన్ భగీరథ, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడమే తమ లక్ష్యమని నేతలు స్పష్టం చేశారు.





# కవ్వాల్ అడవిలో మాఫియా పంజా

- అధికారుల అండతోనే దందా?
- యమదూతల్లా ఇసుక ట్రాక్టర్లు.. సామాన్యుల ప్రాణాలకు ముప్పు
- అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని జన్నారం వాసుల డిమాండ్



**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో అక్రమార్కుల ఆగడాలు పరాకాష్టకు చేరాయి. అటవీ సంపదతో పాటు ఇసుక దోపిడీకి అడ్డుఅదుపు లేకుండా పోతోంది. అధికారుల తీరు చూస్తుంటే అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నట్లు కనిపిస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నా చర్యలు తీసుకోకపోవడం వెనుక భారీగా చేతులు మారుతున్న పర్సంటేజీల హస్తం ఉందని ఆరోపణలు వస్తున్నాయి.

### యమదూతల్లా ఇసుక ట్రాక్టర్లు

మండలంలోని ప్రధాన రహదారులపై ఇసుక ట్రాక్టర్లు యమదూతల్లా విపరీతమైన వేగంతో దూసుకుపోతున్నాయి. కనీస ట్రాఫిక్ నియమాలు పాటించకుండా వెళ్తున్న ఈ వాహనాల వల్ల నిత్యం ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పేదవాడు సైకిల్ పై వెళ్తే తనిఖీ చేసే అధికారులు.. ఊళ్లు దడదడలాడేలా వెళ్తున్న ఈ 'స్పీడ్' ట్రాక్టర్లను ఎందుకు ఆపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అటవీ సంపద కొల్లగొడుతున్నా అధికారులు ఏసీ గదులకే పరిమితం కావడంపై మండిపడుతున్నారు. కోట్లాది రూపాయల జీతాలు తీసుకుంటూ ప్రభుత్వానికే కన్నం వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రత్యేక అధికారిని నియమించాలి

కవ్వాల్ టైగర్ జోన్ లో టేకు కలప స్మగ్లింగ్ తో పాటు వన్యప్రాణుల వేట యథేచ్ఛగా సాగుతోంది. అక్రమార్కులతో చేతులు కలిపిన అధికారులను తక్షణమే విధుల్లోంచి తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ అక్రమాలను అరికట్టడానికి జిల్లా స్థాయి నుంచి ఒక ప్రత్యేక అధికారిని నియమించి విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జన్నారం అడవులను, ఇసుక వనరులను కాపాడాలని.. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయకుంటే అడవి ఉనికికే ప్రమాదమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

